ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలి

రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

ఆదిబట్ల, మార్చి 24: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుండి వినతులు స్వీకరించి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ముగిసిన వెంటనే హాస్టళ్లు,సంక్షేమ వసతి గృహాలలో ఉండే పిల్లలను జాగ్రత్తగా వారి ఇండ్లకు పంపించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ మరియు జిల్లా ఇంటర్మీడియట్ అధికారులకు సూచించారు.ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ప్రతి ఒక్కరూ అనుకున్న సమయంలో పూర్తి చేయాలని పీడీ హౌసింగ్‌కు తెలిపారు.వేసవికాలంలో గ్రామాలలో, మున్సిపాలిటీలలో తాగు నీటి కొరత ఏర్పడ కుండా చూడాలని డీపీఓకు,మన్సిపల్ కమిషనర్లకు,మిషన్ భగీరథ అధికారికి సూచించారు.

ప్రజావాణికి 56 ఫిర్యాదులు...

సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 56 ఫిర్యాదులు వచ్చాయని జిల్లా అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటి కప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవిన్యూశాఖకు-25,ఇతరశాఖలకు-31 వచ్చాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవిన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల అధికారులు, మండల తహశీల్దార్లు,కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మార్చి 24 : ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో ఏర్పాటు చేసిన ప్రజా వాణి సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు 116 ఫిర్యాదులు అందజేశారు. ఇందులో ధరణి కి సంబంధించిన భూ సమస్యలు , ఆసరా పెన్షన్లు , ఇరిగేషన్, భూ సర్వే ఇతర సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని. మండలాలకు సంబంధించిన పలు గ్రామాల ప్రజలు ఇచ్చిన భూ సమస్యలపై ఫిర్యాదులను పరిశీలించారు. ప్రజా ఫిర్యాదు లను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలనీ ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఫిర్యాదు దారులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుదీర్, ఆర్ డి ఓ వాసు చంద్ర, సెక్షన్ సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

వికారాబాద్, మార్చి 24 : జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధులలో వదిలివేయబడిన/గుర్తు తెలియని 148 వాహనాలను వేలం వేయనున్నట్టు ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోలీస్ స్టేషన్ల నుంచి సేకరించి వికారాబాద్ జిల్లా డీటీసీలో డంప్ చేయడం జరిగిందన్నారు. ఈ వాహనాలను ఈ నెల 26 వ తేదీన జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం(డీటీసీ) బహిరంగ వేలం వేస్తామన్నారు. ఈ వాహనాలలో ఏదైనా వాహనంపై ఎవరికైనా అభ్యంతరం, యాజమాన్య హక్కులు లేదా ఆసక్తి ఉంటే, వారు జిల్లా ఎస్పీకి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ వాహనాల వివరాలను జిల్లా పోలీస్ సోషల్ (Facebook,X,Whatsapp) మీడియాలో కూడా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.

టీబీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ



టీబీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న
వికారాబాద్ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తదితరులు

వికారాబాద్, మార్చి 24 :టీబీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. సోమవారం ప్రపంచ టీబీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ , జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్‌ల వికారాబాద్ పట్టణంలోని రామయ్య గూడా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రసంగిస్తూ టీబీ వ్యాధి సాధారణంగా ఒకరి నుండి మరొకరికి గాలి ద్వారా వ్యాపిస్తుందన్నారు. టీబీ వ్యాధి లక్షణాలు జ్వరము, తెమడతో కూడిన దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడడం, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని తెలిపారు. టీబీ వ్యాధి కలిగిన రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తుంపర్ల ద్వారా వ్యాధి క్రిములు గాలిలో కలుస్తాయన్నారు. ఈ గాలిని ఇతరులు పిలిచినప్పుడు పోషకాహార లోపం , అనారోగ్యంతో ఉన్నవారికి టీబీ వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఆరోగ్యవంతులకు టీబీ వ్యాధి సోకే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. కాబట్టి వ్యాధి సోకిన వారు వైద్యుల సూచనల మేరకు పూర్తి చికిత్స తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. చికిత్స కాలం 6 నుండి 8 నెలల వరకు ఉంటుందన్నారు. వైద్య సిబ్బంది టీబీ నిర్ధారణ అయిన రోగులను నిరంతరం పర్యవేక్షిస్తూ పూర్తి చికిత్స తీసుకునే విధంగా చూడాలని సూచించారు. కుటుంబ సభ్యులు కూడా టీబీ రోగి పూర్తి చికిత్స తీసుకునే విధంగా జాగ్రత్తపడాలని తెలిపారు. చికిత్స కాలంలో రోగికి మంచి పోషకాహారం అందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు బుచ్చిబాబు, నిఖిల్, సృజన, సౌమ్య, వైద్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో తోలుకట్టా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సందడి

అసెంబ్లీ సందర్శన అనంతరం
అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు

మొయినాబాద్, మార్చి24:రాష్ట్ర అసెంబ్లీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సందడి చేశారు. బడ్జెట్ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించారు. మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్టా గ్రామంలో ఉన్న మల్లవరపు సీతమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాలకు చెందిన 7,8 తరగతులకు చెందిన 60 మంది విద్యార్థులు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ప్రత్యేకంగా వీక్షించడానికి వెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలు వాణిసక్కుబాయిలు విద్యార్థులను అసెంబ్లీకి సోమవారం తీసుకెళ్లారు.

దిగజారిన రక్షణ.. చేజారిన భద్రత

బాధితులు ప్రైవేటు ఉద్యోగిని , బాలీవుడ్ సహా నటి యువతులపై దాడి చేస్తూ అత్యాచారయత్నాలు.. పోలీసులకు సవాల్ విసురుతున్న దుండగులు..

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరం రోజురోజుకూ భయానకంగా మారుతోంది. నిర్భయ లాంటి కఠిన చట్టాలు ఉన్నా మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు ఆగడం లేదు. కామాంధులు రోజురోజుకూ రెచ్చిపోతూ దారుణాలకు పాల్పడుతున్నారు. వరుస ఘటనలతో సిటీలో మహిళలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా రెండురోజుల్లో రెండు ఘటనలు జరగడం, అది కూడా నగరం నడిబొడ్డున ఒకరిపై, వేలాది మంది ప్రయాణించే ఎంఎంటీఎస్ ట్రైన్‌లో మరొకరిపై జరిగిన అత్యాచారయత్నాలతో దుండగులు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. సోమవారం సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వెళ్తున్న ఎంఎంటీఎస్ ట్రైన్‌లో యువతిపై అత్యాచారయత్నం జరిగింది. మేడ్చల్‌లోని హాస్టల్‌లో ఉంటున్న అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన యువతి(23) సెల్‌ఫోన్ పాడవ్వడంతో రిపేర్ కోసం శనివారం రాత్రి సికింద్రాబాద్‌కు వచ్చింది. సెల్‌ఫోన్ బాగు చేయించుకున్న తర్వాత తిరిగి ఎంఎంటీఎస్‌లో మేడ్చల్ బయలుదేరింది. మహిళ కోచ్ అయితే సురక్షితమనుకున్న ఆ యువతి అందులో ఎక్కింది. కోచ్‌లో తనతో పాటు ఉన్న మరో ఇద్దరు మహిళలు అల్వాల్‌లో దిగిపోయారు. తాను మాత్రం ఒంటరిగా కూర్చుంది. నల్లచొక్కా వేసుకున్న ఓ దుండగుడు కొంపల్లి దగ్గర మహిళల కోచ్‌లోకి ఎక్కాడు. యువతి దగ్గరకు వచ్చి టీజ్ చేశాడు. ఆ తర్వాత ఆ దుండగుడు ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అతడి నుంచి తప్పించుకునేందుకు ఆ యువతి కదులుతున్న ట్రైన్ నుంచి దూకేసింది. కొంపల్లి దాటిన తర్వాత వంతెన వద్ద పడిపోయిన ఆమెకు తీవ్రగాయాలు కావడంతో జీఆర్పీ పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసులు చెప్పారు. అయితే యువతి చెబుతున్నదాని ప్రకారం దుండగుడు ఎప్పుడు ఆ బోగీలోకి వచ్చాడో గమనించలేదని, అల్వాల్‌లో ఇద్దరు మహిళలు దిగిపోయిన తర్వాత ట్రైన్ కదలగానే తనను గట్టిగా పట్టుకున్నట్లు యువతి పోలీసులకు తెలిపింది. దీంతో అతడిని ప్రతిఘటించి ట్రైన్ నుంచి దూకేసినట్లు ఆమె చెప్పినట్లు పోలీసులు తెలిపారు. రైల్వే ఎస్పీ చందనాదీప్తి ఈ కేసును చాలా సీరియస్‌గా పర్యవేక్షిస్తున్నారు. సీసీ పుటేజీల ఆధారంగా దుండగుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తే అసలు సికింద్రాబాద్‌లో తప్ప.. మిగతా చోట్ల సీసీ కెమెరాలు లేవని, కొన్నిచోట్ల ఉన్నా అవి పనిచేయట్లేదని పోలీసులు చెప్పారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. దవడ వద్ద తీవ్రగాయమైందని, పై పళ్లు ఊడిపోవడంతో మాట్లాడడం కష్టమవుతున్నదని బాధితురాలి సోదరుడు చెప్పారు.

పనిచేయని కెమెరాలు..

కెమెరాలు పనిచేయకపోవడంతో నిందితుడిని గుర్తించడం పోలీసులకు కష్టమవుతోంది. మరోవైపు పోలీసులకు నిందితుడికి తాలూకు ప్రయాణ వివరాలు కూడా తెలుసుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఓ అధికారి చెప్పారు. ఇదిలాఉంటే నిందితుడు యువతికి ముందే తెలిసిన వాడా.. లేక ఆమెను వెంబడిస్తూ వచ్చాడా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. యువతి చెప్పిన ఆనవాళ్ల ప్రకారం స్టేషన్‌తో కనెక్టివిటీ ఉన్న సీసీ పుటేజీ అంతా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

నాలుగు బృందాలతో ..

అన్ని స్టేషన్లు, అన్ని బోగీల్లో సీసీ కెమెరాలు లేవని రైల్వే ఎస్పీ చందనాదీప్తి చెప్పారు. ఈ కేసులో నిందితుడిని పట్టుకోవడానికి నాలుగు బృందాలు వేసి గాలింపు చర్యలు చేపట్టామని చందనాదీప్తి చెప్పారు. ఈ కేసును ఛేదించడం తమకు పెద్ద సవాల్ అని.. అయినా త్వరలోనే కచ్చితంగా నిందితుడిని పట్టుకుంటామని చందనాదీప్తి చెప్పారు. ప్రధానంగా ప్రయాణికులు వారి భద్రత వారే చూసుకోవాలని, అందుకోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బాలీవుడ్ సహా నటిపై అత్యాచారయత్నం..!

ముంబైకి చెందిన ఓ బాలీవుడ్ సహా నటి హైదరాబాద్‌కు వచ్చిన మూడురోజుల తర్వాత తనపై అత్యాచారయత్నం చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడం, ఆ తర్వాత పోలీసులు కేసు ఛేదించే పనిలో అసలు ఈ ఫిర్యాదే తప్పుడు ఫిర్యాదంటూ ప్రెస్‌నోట్ విడుదల చేయడం సంచలనంగా మారింది. ఓ షాపు ప్రారంభోత్సవం పేరుతో ముంబై నటిని ఆహ్వానించి ఆపై ఆమెను బంధించి వ్యభిచారం చేయాలంటూ ఒత్తిడి చేసిన ఘటన హైదరాబాద్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. బాలీవుడ్‌లో సినిమాలతో పాటు టీవీ సీరియల్స్‌లో నటిస్తున్న ఓ నటిని ఈనెల 17న హైదరాబాద్‌లోని ఆమె స్నేహితురాలు షాప్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించింది. కార్యక్రమంలో పాల్గొన్నందుకు ప్రయాణ ఖర్చులు, పారితోషికం చెల్లిస్తారని చెప్పింది. ఆమె మాటలు నమ్మి ఈనెల 18న హైదరాబాద్‌కు వచ్చిన యువతిని మాసబ్ ట్యాంక్ శ్యామ్‌నగర్‌కాలనీలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో బస ఏర్పాటు చేశారు. ఆ ఇంట్లో ఉన్న వృద్ధురాలు నటికి అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చారు. అయితే 21న రాత్రి 9 గంటలకు ఇద్దరు మహిళలు నటి ఉన్న అపార్ట్‌మెంట్‌కు వెళ్లి ఆమెను వ్యభిచారం చేయాలని ఒత్తిడి చేశారు. అదేరోజు రాత్రి 11 గంటలకు ముగ్గురు పురుషులు ఆ నటి ఉన్న గదిలోకి ప్రవేశించి తమతో గడపాలని ఒత్తిడి చేశారు.ఆమె ఒప్పుకోకపోవడంతో ఆమెపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఆమె గట్టిగా అరిచి పోలీసులకు చెబుతానని బెదిరించడంతో వారు పారిపోయారు. ఆ తర్వాత వృద్ధురాలితో పాటు ఇద్దరు మహిళలు వచ్చి ఆమెను కొట్టి తన వద్ద ఉన్న 50వేల రూపాయల నగదు తీసుకొని గదిలో బంధించి వెళ్లిపోయారు. బాధితురాలు 100కు డయల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసిన మాసబ్ ట్యాంక్ పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. అయితే ముంబైకి చెందిన సహా నటి విషయంలో జరిగిన ఈ ఘటనతో హైదరాబాద్ ఇమేజ్ దెబ్బతినే అవకాశమున్నందున పోలీసు బాస్‌ల నుంచి స్థానిక పోలీసులకు పెద్ద ఎత్తున చీవాట్లు పడ్డాయి. ఈ కేసును సీరియస్‌గా తీసుకోవాలంటూ పోలీస్ బాస్ సూచించినట్లు సమాచారం.

తప్పుడు ఫిర్యాదంటున్న పోలీసులు

అయితే బాలీవుడ్ సహా నటి కేసులో ఇది తప్పుడు ఫిర్యాదు అంటూ మసబ్ ట్యాంక్ పోలీసులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఫిర్యాదుపై తాము దర్యాప్తు చేస్తున్నప్పుడు ఇది తప్పుడు ఫిర్యాదుగా తేలిందని సీఐ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మహిళ ఈనెల 18న బాలీవుడ్ సహా నటితో పాటు మరో ఇద్దరు యువతులను నగరానికి పిలిపించినట్లు తెలిపారు. తన తల్లి సహకారంతో వ్యభిచార గృహం నడుపుతున్న నరేశ్ అనే వ్యక్తి ఇంటికి ఆ ముగ్గురిని తీసుకెళ్లారని చెప్పారు. ఆ తర్వాత శనివారం హైదరాబాద్‌కు చెందిన మహిళతో పాటు ముగ్గురు యువతులకు మధ్య డబ్బుల చెల్లింపులకు సంబంధించి గొడవ జరిగిందని, దీంతో బాలీవుడ్ సహా నటి వారిపై ఫిర్యాదు చేసి సొంతూరికి వెళ్లిపోయినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం పోలీసులు హైదరాబాద్‌కు చెందిన మహిళతో పాటు నరేశ్, బాలీవుడ్ సహా నటి, మరో ఇద్దరు యువతుల గురించి గాలిస్తున్నామని, మరో టీమ్‌ను పంకజ్ అనే ముంబై బ్రోకర్‌ను వెతకడానికి పంపించామని పేర్కొన్నారు.

అందాల పోటీలు కాదు.. అమ్మాయిలకు రక్షణ కల్పించండి

కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత కరవు

ఎంఎంటీఎస్‌లో యువతిపై అత్యాచారయత్న ఘటనపై బీఆర్ఎస్ ఆగ్రహం

గాంధీలో బాధితురాలిని పరామర్శించిన మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్

సిటీబ్యూరో/బన్సీలాల్‌పేట, మార్చి24,(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అమ్మాయిలు, మహిళలకు భద్రత కల్పించకుండా అందాల పోటీలు పెడుతున్నారని, కాంగ్రెస్ పాలనలో ప్రతిరోజూ ఏదో ఒక మూలన మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, ఆడవాళ్లకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎంటీఎస్ రైలులో అత్యాచారయత్నానికి గురై, రైలు నుంచి దూకి గాంధీలో చికిత్స పొందుతున్న బాధిత యువతిని సోమవారం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి తో కలిసి పరామర్శించారు. మెరుగైన సేవలందించాలని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారికి సూచించారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు అనే విషయాన్ని ఈ సంఘటన తెలియజేసిందని వాపోయారు. ఇటీవల పోలీసు శాఖ విడుదల చేసిన వార్షిక నివేదికలో గత 15 నెలల వ్యవధిలోనే రాష్ట్రంలో 22 శాతం క్రైమ్ రేటు పెరిగినట్లు అందులో ప్రకటించారని ఆమె గుర్తుచేశారు. రైలు, బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించవచ్చనే ఆలోచన మహిళల్లో ఉంటుందని, కానీ ఇటీవల బస్సులో డ్రైవర్లు ప్రయాణికులపై దాడి చేయడం, ప్రస్తుతం రైల్లో కూడా అత్యాచారయత్న సంఘటనలు చోటు చేసుకోవడం చూస్తుంటే, రాష్ట్రంలో మహిళల భద్రతపై భయం వేస్తుందని ఆవేదన చెందారు. మహిళల కోసం కేటాయించిన రైలు భోగీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తాము రైల్వే పోలీసులను కోరుతున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించి, బాధితురాలికి న్యాయం చేయాలని ఆమె తెలిపారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..తల్లిదండ్రులు తమ పిల్లల బయటకు వెళ్లి క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని కోరుకుంటారని, ప్రస్తుతం క్షణక్షణం తల్లిదండ్రులు భయపడుతున్నారని వాపోయారు. అందాల పోటీలు నిర్వహించడానికి రూ. 200 కోట్లు ఖర్చు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని మహిళల భద్రతకు ఖర్చు పెట్టాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ బాధితురాలి దవడ, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయని, ఆమెకు సూపర్ స్పెషాలిటీ వైద్య చికిత్సలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విచారణ వేగవంతం చేశాం..రైల్వే ఎస్పీ చందనాదీప్తి

నిందితుడిని పట్టుకునేందుకు విచారణ వేగవంతం చేశాం. వీలైనంత త్వరగా నిందితుడిని పట్టుకుంటాం. రైలులో ప్రయాణించే మహిళలు తమ స్మార్ట్ ఫోన్‌లో షీటీం సూచించిన పలు యాప్‌లు డౌన్లోడ్ చేసిపెట్టుకోవాలి. ఏదైనా ప్రమాదం ఉందని గుర్తిస్తే.. దానిలో సమాచారం అందిస్తే వెంటనే ఆర్పీఎఫ్ పోలీసులు 10 నిమిషాల్లో అక్కడికి చేరుకుంటారు' రైల్వే ఎస్పీ చందనాదీప్తి తెలిపారు.

నిలకడగా ఉంది: డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్ కుమార్

బాధితురాలిని శనివారం రాత్రి అత్యవసర విభాగానికి తరలించగానే చికిత్స ప్రారంభించాం. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. డెంటల్, న్యూరో, గైనకాలజీ వైద్యులు ఆమెను పరీక్షిస్తున్నారు' అని గాంధీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా బాధితురాలికి మెరుగైన వైద్యం అందించేందుకు సోమవారం సాయంత్రం గాంధీ ఆసుపత్రి నుంచి యశోద హాస్పిటల్‌కు తరలించి, చికిత్సనందిస్తున్నారు.

1,000 లాభం చూపించి.. 75.65 లక్షలు కొట్టేశారు!

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు బురిడీ

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ): రాచకొండ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్‌లో నివాసముండే ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ నేరగాళ్లు రూ. 75 లక్షలు బురిడీ కొట్టించారు. బాధితుడికి ఫిబ్రవరి 21న వాట్సాప్‌నకు సెక్యూర్ ట్రేడ్ పేరుతో మేసేజ్ వచ్చింది, వాట్సాప్ గ్రూప్‌లోకి అతడి నంబర్‌ను యాడ్ చేశారు. ట్రేడింగ్‌లో 30 శాతం లాభాలు సంపాదించాలంటే గూగుల్ ప్లేస్టోర్‌కు వెళ్లి తాము సూచించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. బాధితుడు ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మొదట రూ.50 వేలుపెట్టుబడి పెట్టగా, రూ. 2471 నష్టంతో ఆ స్టాక్‌ను ఒక్కరోజులోనే విక్రయించాడు. ఆ తరువాత మరో రూ.50 వేలు పెట్టుబడితో పారాగాన్ స్టాక్స్‌ను, ఆ తరువాత అడానైంట్ స్టాక్స్‌ను కొని రూ.2 వేల చొప్పున నష్టంతో విక్రయించాడు. అయితే అప్పటి వరకు సైబర్‌నేరగాళ్లు నమ్మకంగా ఉన్నారు. నికోలస్ ఆఫీస్ సొల్యూషన్ లిమిటెడ్ ఐపీఓ ఆఫర్‌లో ఉందని సూచించాడంతో రూ. 8.3 లక్షలు పెట్టుబడి పెట్టడంతో 7095 షేర్స్ అలాట్ అయ్యాయి, వాటిని కొని విక్రయించడంతో రూ.14.47 లక్షల లాభం కనిపించింది. అలాగే ఐపీఓ ఎన్ఏపీఎస్ గ్లోబల్ ఇండియా రూ. 35.90 లక్షల విలువైన 39891 షేర్స్‌ను కొన్నాడు. ఇలా ఐపీఓలు కొనుగోలు చేసిన షేర్లకు భారీగా విలువ పెరుగుతుండడం, స్క్రీన్‌పై కోట్ల రూపాయల లాభం కనిపించింది. వాటిని విత్ డ్రా చేసుకోవాలంటే మీరు ట్యాక్స్‌లు, ఇతరాత్ర డబ్బు చెల్లించాలంటూ షరతులు విధించారు. ఇలా బాధితుడు రూ. 75,65,700 పెట్టుబడి పెట్టడంతో రూ. 1000 లాభం వచ్చింది. అయితే మొత్తం రూ. 75,64,700 నష్టపోయానంటూ బాధితుడు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మాని యా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 29లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల రెండవ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 29 వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ (ఐఎస్) రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 26 నుంచి, మాస్టర్స్ డిగ్రీ ఇన్ పోలీస్ మేనేజ్మెంట్ వన్ టైం చాన్స్ పరీక్షలను వచ్చే నెల 5 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. వివరాలను ఓయూ వెబ్సైట్‌లో చూసుకోవాలన్నారు.

ఆటలాడుతూ అనంతలోకాలకు..

ఉపాధిహామీ పథకం శిలాఫలకం బోర్డు పడి అంగన్‌వాడీ బాలుడు దుర్మరణం

అల్లాపూర్‌లో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్, గ్రామస్తులు

సాయితేజ్(ఫైల్)

కులకచర్ల, మార్చి 24 : అంగన్‌వాడీ కేంద్రంలో ఆటలు ఆడుకుంటున్న బాలుడు అంతలోనే అనంతలోకాలకు వెళ్లిన సంఘటన కులకచర్ల మండలం అల్లాపూర్ తండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి అల్లాపూర్ తండాకు చెందిన ఇస్లావత్ సాయితేజ్(4) వెళ్లాడు. సాయితేజ్‌ను వారి కుటుంబసభ్యులు సోమవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రంలో వదిలి వెళ్లారు. సాయితేజ్ తన స్నేహితులతో కలి